సాక్షి వికారాబాద్

శనివారం । 16 । డిసెంబర్ । 2023



అభినందనలు

మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న వలు వురికి శుక్రవారం డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. 8లో▸



ప్రోత్సహించాలి

దివ్యాంగులను మనతో సమానంగా చూడాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలితకుమారి అన్నారు. 8లో▸



నిప్పుతో నిస్సారమే

పంట కోత తరువాత మిగిలిన వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో ముప్పు పొంచి ఉందని అధికారులు అంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

జెడ్పీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి

చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

వికారాబాద్ అర్బన్: వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి జెడ్పీ నూతన భవన నిర్మాణం పూర్తి కావాలని చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం పీఆర్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి భవనం అందుబాటులోకి రావాలని ఆదేశించారు. అలాగే జిల్లాకు మంజూరైన అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జెడ్పీ అతిథి గృహాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. పాత ఎంపీడీవో కార్యాలయాల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిని, పీఆర్‌ఈఈ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రం ఉంటే పత్తి కొనుగోలు చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పత్తి పంట సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాని పక్షంలో వ్యవసాయ విస్తరణ అధికారి రైతులకు జారీ చేసే ధ్రువీకరణ పత్రం ఉంటే పత్తి కొనుగోలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయ విస్తరణ అధికారి సంయుక్తంగా పంట పొలాలను పరిశీలించి ధ్రువీకరణ పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆ పత్రాన్ని పరిగణలోకి తీసుకొని జిన్నింగ్ మిల్లు వద్ద సీసీఐ వారు పత్తి కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ నిబంధనలు అర్హులైన పోడు, కౌలు రైతులకు వర్తిస్తుందని తెలిపారు.

23న జిల్లాస్థాయి పోటీలు

వికారాబాద్ అర్బన్: జిల్లా యువజనోత్సవాల్లో భాగంగా ఈనెల 23న సామూహిక, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే క్రీడా పోటీల్లో ఆసక్తి గల యువతి, యువకులు పాల్గొనాలని కోరారు. క్రీడా కారుల వయస్సు 15 నుంచి 29 ఏళ్లలోపు ఉండాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 19వ తేదీలోపు కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676638201లో సంప్రదించాలన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదుపై సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శుక్రవారం ఓటరు నమోదుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ తప్పని సరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలింగ్ బూత్‌ల వారీగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 1,300 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. వలస ఓటర్లు, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులో చిరునామాలో మార్పులు చేర్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మోక్షం లభించేనా?

రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చే విషయంలో తీవ్ర జాప్యం

- ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో 35వేల దరఖాస్తులు
- కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో లబ్ధిదారుల్లో ఆశలు
- జిల్లాలో 588 రేషన్ దుకాణాలు
- ఫుడ్ సెక్యూరిటీ కార్డులు 2,41,622
- ప్రతినెలా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం 4,673 మెట్రిక్ టన్నులు



పెండింగ్‌లో వేల దరఖాస్తులు

వికారాబాద్: రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లను చేర్చే విషయంలో గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో లబ్ధిదారులు నిరాశకు గురయ్యారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొలువుదీరింది మొదలు కార్డుల్లో మెంబర్ యాడింగ్ విషయంలో మీనమేషాలు లెక్కిస్తూ వచ్చింది. ఎనిమిదేళ్ల క్రితం ఆహార భద్రత పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ సమయంలో ఆయా కుటుంబాల్లో ఎంత మంది అయితే ఉన్నారో వారి పేర్లను అందులో చేర్చారు. అయితే గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో కుటుంబాల్లో అదనంగా చాలా మంది సభ్యులు వచ్చి చేరారు. ఇందులో కొందరు వివాహం చేసుకుని అత్తవారింటికి వచ్చిన వారు కాగా, ఆయా కుటుంబాల్లో ఎనిమిదేళ్లుగా జన్మించిన చిన్నారులు, కార్డుల జారీ సమయంలో సాంకేతిక కారణాలతో మిస్సయిన వారు ఇలా వేల సంఖ్యలో పెరిగిపోయారు. కార్డుల జారీ తరువాత మరి కొందరు సాంకేతిక సమస్యల వల్ల కూడా పేర్లు తొలగించబడ్డాయి. మృతి చెందిన వారి పేర్లను వెంటనే తొలగిస్తున్న ప్రభుత్వం కార్డుల్లో చేర్చాల్సిన వారి విషయంలో మాత్రం ఏ నిర్ణయం తీసుకోలేదు. రేషన్ కార్డుల్లో తమ పేర్లు చేర్చాలంటూ పెట్టుకున్న అర్జీలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

గత ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం ఆహార భద్రత కార్డుల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించిన జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచింది. అయితే రేషన్ కార్డులు జారీ చేయకుండా ఏడాదికి సరిపడా కూపన్లు ఇచ్చింది. ఆ తరువాత కూపన్లు కూడా ఇవ్వడం మానేసింది. దీంతో లబ్ధిదారులు నెట్ సెంటర్లలో కూపన్లు తెచ్చుకున్నారు. అనంతరం పూర్తి స్థాయిలో బయోమెట్రిక్ విధానం అమలు చేయడంతో వారి సమస్య తీరింది. ఎనిమిదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకుండా కాలయాపన చేసిన గత సర్కారు.. పోయిన సంవత్సరం కొత్త కార్డులు మంజూరు చేసింది. అయితే కుటుంబాల్లో పెరిగిన సభ్యులను, వచ్చి చేరిన వారిని ఆహార భద్రత కార్డు జాబితాలో చేర్చలేదు. దీంతో వారు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 35వేల మంది దరఖాస్తు చేసుకొని కార్డుల్లో పేర్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ దరఖాస్తులకు మోక్షం లభిస్తే జిల్లాలో మరో 210 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెరగనుంది. ఇలా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రేషన్ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేదలకు దక్కడం లేదు. రేషన్ సరఫరాలో అవకతవకలను అరికట్టేందుకు అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్న పౌర సరఫరాల శాఖ లబ్ధిదారులకు త్వరితగతిన న్యాయం చేసే విషయంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తోంది.

జిల్లాలో 2,41,622 ఆహార భద్రత కార్డులు

జిల్లాలోని 20 మండలాల్లో 588 రేషన్ దుకాణాలు ఉండగా 2,41,622 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఇందులో 2,08,162 ఎఫ్ఎస్సీ కార్డులు, 26,730 అంత్యోదయ కార్డులు, 39 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా 4,673 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు అంత్యోదయ కార్డుల లబ్ధిదారులకు 2,673 మెట్రిక్ టన్నుల చక్కెర పంపిణీ చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా జిల్లాలో 6,691 కొత్త రేషన్ కార్డులు పెరిగాయి.



ఇస్తెమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

'ఇస్తెమా'కు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి: పరిగి పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఇస్తెమా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. పట్టణంలో ఇస్తెమ నిర్వహించే స్థలాన్ని శుక్రవారం అధికారులు, ముస్లిం పెద్దలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి 6నుంచి 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ముస్లింలు వస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలం వంటివి సమకూర్చాలని ఆదేశించారు. ఇస్తెమా కార్యక్రమానికి చాలా స్థలం కావాల్సి ఉన్నందున రైతులను ఒప్పించాలని అధికారులకు సూచించారు. ఒక వేళ పంటలు దెబ్బతింటే పరిహారం చెల్లిస్తామని చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, డీఎండబ్ల్యూఓ సుధారాణి, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్‌బాబు, తహసీల్దార్ ఆనంద్‌రావు, పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

రూ.2.45 కోట్లు విడుదల

పట్టణంలో ముస్లింలు నిర్వహించే ఇస్తెమా కార్యక్రమానికి ప్రభుత్వం రూ.2.45 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ముస్లిం మత పెద్దలతో కలసి కార్యక్రమ ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది ముస్లింలు ప్రార్థనలు నిర్వహించే ఇస్తెమ కార్యక్రమం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని పేర్కొన్నారు.



ముస్లిం మత పెద్దలతో కలసి బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న గంజాయి.. కేసు వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

వంద కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి కారు డిక్కీలో తరలింపు
- సురంగల్ శివారులో డంప్ చేస్తుండగా స్వాధీనం
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: కారు డిక్కీలో తీసుకొచ్చిన వంద కిలోల గంజాయి ప్యాకెట్లను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ రష్మి తెర్మల్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ ఏపీ రంగా, తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం బికనీర్, ప్రతాప్ బస్తీకి చెందిన భావర్‌ఖాన్ మేడ్చల్ ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం రాయఘడ్ జిల్లా పదంపూర్‌లో మనోజ్ అనే వ్యక్తి దగ్గర రూ.5.50 లక్షలకు 100 కిలోల ఎండు గంజాయి (50 ప్యాకెట్లు) కొనుగోలు చేశాడు. వాటిని తన కారు (టీఎస్ 35 ఈ 5279) డిక్కీలో పెట్టుకుని నగరంలోని ధూల్‌పేటకు చెందిన సునీల్ సింగ్‌కు అమ్మడానికి వచ్చాడు. అతని ఫోన్ చేయగా తాను అందుబాటులో లేనని.. మొయినాబాద్ మండలం సురంగల్ శివారులో ఉన్న ఏఎంఆర్ వెంచర్‌లోని ఓ ప్లాట్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి దగ్గరకు వెళ్లాలని.. అక్కడ తన బావమరిది వినేష్ సింగ్‌గాని, తమ్ముడు నితేష్ సింగ్‌గానీ ఉంటారని చెప్పాడు. ముందుగా మాట్లాడుకున్న ప్రకారం అమ్మడానికి భావర్‌ఖాన్ శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో సదరు వెంచర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి చేరుకున్నాడు.

పక్కా సమాచారంతో..

ముడిమ్యాల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న పుకార్లు ఇటీవల ఎక్కువగా రావడంతో మొయినాబాద్ ఎస్సై కిషన్ సింగ్, హెడ్‌కానిస్టేబుల్ దేవి సింగ్, కానిస్టేబుల్ రాజు, హోంగార్డు సత్తయ్య బృందం వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్ గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తోంది. గంజాయి విక్రయిస్తున్నట్లు వారికి సమాచారం అందింది. అక్కడికి వెళ్లి చూడగా ఇద్దరు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంటనే పట్టుకున్నారు. అక్కడే ఉన్న కారు డిక్కీ తెరిచి చూడగా 50 గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. గంజాయి తెచ్చిన భావర్‌ఖాన్‌ను, నితేష్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితోపాటు కారు, స్కూటీ, రెండు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సునీల్ సింగ్, అతని భార్య నందిని, అత్త లక్ష్మీబాయి, మరో వ్యక్తి అభిషేక్, రాయఘడ్‌కు చెందిన మనోజ్ పరారీలో ఉన్నారని.. త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీసు బృందాన్ని అభినందించారు. కాగా భావర్‌ఖాన్‌పై 2021లో నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గుట్కా రవాణా కేసు నమోదైంది. నితేష్‌సింగ్‌పై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు ఉంది.

మహిళలకు భారత ప్రభుత్వం పెద్దపీట

- ఆలిండియా సహకార భారతి అధ్యక్షుడు దీననాథ్ ఠాగూర్

నందిగామ: భారత ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తోందని ఆలిండియా సహకార భారతి అధ్యక్షుడు దీననాథ్ ఠాగూర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత మహిళా సహకార మూడో సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ.. దేశంలోని 26 రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మంది మహిళలు ఈ కార్యక్రమానికి హాజరు కావడం సంతోషకరమని అన్నారు. సహకార భారతి పలు సహకార సంఘాల సభ్యులకు వివిధ వ్యాపారాల గురించి శిక్షణ ఇస్తుందని వివరించారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు, విస్తరించుకునేందుకు కావాల్సిన వనరులు, మార్కెటింగ్ తదితర విషయాల గురించి శిక్షణ ఇచ్చి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్‌తో కలిసి ధ్యానం చేశారు. కార్యక్రమంలో సహకార భారతి కార్యదర్శి ఉదయ్ జోషి, మహిళా ప్రముఖులు రేవతి చందూర్ నికర్, భాగ్యశ్రీ సాటే, భగవతి బల్దేవ, రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగిళ్ల కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఏం కొంటాం ఏమో..!

ఏ కూరగాయలైనా కిలో రూ. 50 పైచిలుకే

- ఆకుకూరలదీ అదే పరిస్థితి
- వందకు చేరువలో క్యాప్సికమ్
- ఆందోళనలో సామాన్యులు



వికారాబాద్‌లోని రైతు బజారు

వికారాబాద్ అర్బన్: కొన్ని రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. మార్కెట్‌లో ఏ కూరగాయ కొనాలనుకున్నా కిలో రూ. 50 పైచిలుకు మాటే. దీంతో సామాన్యులు కూరగాయలు కొనాలంటేనే హడలిపోతున్నారు. వారం పది రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి కారణం వికారాబాద్ ప్రాంతంలో కూరగాయల సాగు తక్కువగా ఉండడమే అని వ్యాపారులు అంటున్నారు. పచ్చిమిర్చి, టమాటా ధరలు తగ్గడం లేదు. జిల్లాలో కూరగాయల సాగు పెద్దగా లేకపోవడంతో దళారులు ధరలను అమాంతం పెంచేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా బోరు బావుల ద్వారానే పంటలు సాగు చేస్తున్నారు. నవాబుపేట, పూడూరు, వికారాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి, పరిగి వంటి కొన్ని మండలాల్లోనే కూరగాయల సాగు అధికంగా ఉంది. టమాటా, వంకాయ, బెండ, బీర, దొండ, చిక్కుడు, ఉల్లి, పచ్చిమిర్చి, క్యాబేజ్, క్యాలీఫ్లవర్ వంటి పంటలు ఎక్కువగా సాగు చేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఆకుకూరలు పండిస్తున్నారు.

కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	కిలో ధర
టమాటా	రూ. 40
క్యాలీఫ్లవర్	రూ. 60
పచ్చిమిర్చి	రూ. 60
క్యాబేజీ	రూ. 30
వంకాయ	రూ. 40
ఆలుగడ్డ	రూ. 40
క్యాప్సికమ్	రూ. 80
క్యారెట్	రూ. 40
దొండ	కిలో 60
బీన్స్	రూ. 80
బెండ	రూ. 60
కాకర కాయ	రూ. 60
బీర	రూ. 60

అయితే నవాబుపేట, వికారాబాద్, పూడూరు మండలాల రైతులు వారి పండించిన ఆకుకూరలను హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. చిన్నచిన్న రైతులు మాత్రమే స్థానిక మార్కెట్లలో విక్రయిస్తున్నారు. దీంతో కొరత ఏర్పడి ధరలు మండిపోతున్నాయని కూడా చెప్పవచ్చు.

ఇతర ప్రాంతాల నుంచి..

జిల్లా ప్రజలకు అవసరమైన మేర కూరగాయల సాగు లేకపోవడంతో కమీషన్ ఏజెంట్లు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. ప్రధానంగా ఏపీలోని కర్నూల్, అనంతపురం తోపాటు, హైదరాబాద్ నుంచి కూరగాయలు తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కొంత మేర కూరగాయలు వచ్చినా డిమాండ్‌కు సరిపోవడం లేదు. కమీషన్ ఏజెంట్ల వద్ద వ్యాపారులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేసి రైతు బజారులో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. బీన్స్, క్యాప్సికం వంటి కూరగాయాలు కిలో రూ. 80కి పైగానే పలుకుతున్నాయి. ప్రస్తుతం శుభకార్యాలు కూడా పెద్దగా లేక పోయినా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు ఏమీ కొనలేని పరిస్థితిలో ఉన్నారు. గతంలో పది రూపాయలకు రెండు కట్టల ఆకు కూరలు ఇచ్చేవారు. ఇప్పుడు రూ. 20కి మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. వికారాబాద్‌లోని రైతు బజారు బోర్డులో కూరగాయల రేటు ఒకలా ఉంటే వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయినా సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

భవిష్యత్ తరాలకు బంగారు నేలనిద్దాం

- పద్మశ్రీ అవార్డు గ్రహీత, వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్
- గో ఆధారిత పంటల సాగుపై రైతులకు అవగాహన



ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త పాలేకర్

ధారూరు: గో ఆధారిత విధానంలో పండించే ప్రకృతి వ్యవసాయ పంటలపై పద్మశ్రీ సుభాష్ పాలేకర్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. బూర్గుగడ్డలోని పాలేకర్ పరిశోధన కృషి వ్యవసాయ క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీరో బడ్జెట్ సేంద్రియ వ్యవసాయం, సహజ పద్ధతులు ఉపయోగించి భూమి, భూసారాన్ని కాపాడి, భవిష్యత్ తరాలకు బంగారు నేలను అందించాలని సూచించారు. దేశవాళీ ఆవుల పేడ, మూత్రం ద్వారా ఘనామృతం, జీవామృతం తయారుచేసి, పంటల సాగుకు వినియోగించాలని సూచించారు. ఈ విధానాలను రైతులకు వివరించారు. అనంతరం పరిశోధన కేంద్రంలోని గోశాల, పందిరి పంటలు, పసుపు, బహురూప కాల పంటలను పరిశీలించారు. కొత్తగా ప్రకృతి వ్యవసాయ చేసే రైతుల కోసం విత్తనాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ విజయరామ్, ఇస్కాన్ హరే రామ, హరే క్రిష్ణా ప్రతినిధులు, సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పరిశీలన



క్యాంపు కార్యాలయ ఆవరణను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న సామాగ్రిని తనిఖీ చేశారు. ఎమ్మెల్యే అధికారిక నివాసంగా ఉన్న కార్యాలయంలో తక్షణం తీసుకోవాల్సిన చర్యలు.. భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనుల గురించి వాకబు చేశారు. ప్రస్తుతం కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ ఎస్‌ఈ వసంత్‌నాయక్, డీఈ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



మృతురాలి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు

కొడంగల్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరయ్యారు. మండల పరిధిలోని అంగడిరాయిచూర్‌లో పట్నం నరేందర్‌రెడ్డి అనుచరుడు బీఆర్ఎస్ నాయకుడు బిచ్చిరెడ్డి భార్య దశదిన కర్మలో పాల్గొని బిచ్చిరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బిచ్చిరెడ్డి, రఘుపతిరెడ్డి, నరేశ్‌గౌడ్, బాకారం అరుణ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ నియామకం



బాధ్యతలు స్వీకరించిన నాగరాజుయాదవ్

కుల్కచర్ల: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ నాగరాజుయాదవ్ నియమితులయ్యారు. సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పూర్వం కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘ చైర్మన్‌గా ఉన్న బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అందజేస్తూ శుక్రవారం పాలకమండలిలో తీర్మానించారు. ఖాళీ అయిన డైరక్టర్ స్థానం నుంచి కొత్త అభ్యర్థిని ఎన్నుకున్న తర్వాత పాలకవర్గ ఎన్నిక నిర్ణయం మేరకు కొత్తవారిని ఎన్నుకునే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, డైరక్టర్లు విజయ్‌కుమార్, కొండయ్య, సత్యమ్మ, రత్నమ్మ, నర్సింలు, కృష్ణయ్య, హమ్లా నాయక్, ఆశన్న, భీమయ్య, పెద్ద అంజిలయ్య, సార నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మొయినాబాద్: మొయినాబాద్ మండల కేంద్రంలోని మెథడిస్ట్ చర్చి మైదానంలో శుక్రవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా మెథడిస్ట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ మెథడిస్ట్ బిషప్ ఎంఏ డానియేల్ పాల్గొని.. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. యువత మత్తుకు బానిస కాకుండా క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో పయనించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లాలోని 29 మెథడిస్ట్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఆశలు

అసెంబ్లీలో అధికంగా నూతన ఎమ్మెల్యేలు

- ప్రభుత్వం నుంచి నిధుల సేకరణ, పౌర హక్కుల రక్షణ బాధ్యత వారిదే
- ఇప్పటికే శాసనసభ్యులకు శిక్షణ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు

షాద్‌నగర్: ప్రజలు ఓటేసి ఎన్నుకున్న వారు ఎమ్మెల్యేలుగా శాసన సభలో ప్రమాణస్వీకారాలు చేశారు. ఇక నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు. అయితే పాలనలో శాసనసభ్యులు బహుముఖ పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేగా వారి విధులు, బాధ్యతలు, ప్రభుత్వం వారికి ఇచ్చే జీత భత్యాలు, నియోజకవర్గ అభివృద్ధిలో వారి పాత్రను తెలుసుకుందాం.

సభలకు 'తొలి' పరిచయం

అధికార పార్టీకి చెందిన వారిలో చాలా మంది తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో వీరికి ఇటీవల కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యేల బాధ్యతలు, విధులు, హక్కులు, అసెంబ్లీ నియమ నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన వారు శాసనసభలో సభ్యులు అవుతారు. నియోజకవర్గం తరపున శాసనసభకు ప్రాతినిథ్యం వహిస్తారు. స్వప్రయోజనాలకు, వివక్షకు తావులేకుండా న్యాయం చేయడం శాసనసభ్యుల ప్రధాన విధి.

- వీరికి రాష్ట్రపతి ఎన్నికలో ఓటు హక్కు ఉంటుంది
- శాసనసభా కమిటీల్లో సభ్యులుగా ఉంటారు.
- రాష్ట్ర ప్రభుత్వ చట్టాల రూపకల్పనలోనూ భాగస్వామ్యులవుతారు.
- మున్సిపాలిటీలకు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు.

నిధులు.. సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి భారత రాజ్యాంగం చట్టాలను రూపకల్పన చేసే అధికారం కల్పించింది. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ఆర్టికల్ 246 పొందుపర్చిన విధంగా రాష్ట్ర జాబితా, ఏకకాలిక జాబితాలోని అన్ని అంశాలపై చట్టాలను రూపకల్పన చేయవచ్చు.
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ కలిగి ఉండేది శాసనసభ ఒక్కటే. ప్రభుత్వం సమర్పించే బడ్జెట్‌ను ఎమ్మెల్యే చర్చించి ఆమోదిస్తారు.



- ప్రభుత్వం రూపొందించే పథకాలను సమర్థవంతంగా అమలు అయ్యేలా.. అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాల్సి ఉంటుంది.
- నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటుగా పనుల తీరు తెన్నులను పర్యవేక్షించాలి.
- ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.
- అభివృద్ధి పనుల పురోగతి, సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలి.
- పౌర హక్కులకు రక్షణగా నిలిచి వ్యవస్థలను పటిష్ఠం చేయాలి.
- పట్టణాల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీ నుంచి నిధులు తీసుకువచ్చి ఖర్చు చేసే వీలుంటుంది.
- ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి నిధులు రాబట్టి అభివృద్ధి పనులు చేయొచ్చు.
- మంత్రులు, ఎమ్మెల్సీలను సమన్వయం చేసుకుని ప్రత్యేక నిధులను సద్వినియోగం చేసుకోవచ్చు.
- వివిధ మంత్రిత్వ శాఖల నుంచి మంజూరయ్యే నిధులతోనూ నియోజకవర్గ అభివృద్ధికి వీలుంటుంది.

ఎమ్మెల్యేలకు జీతం.. మాజీలకు పెన్షన్

ఎమ్మెల్యేకు జీతం ఎంత ఉంటుందో చాలా మందికి అవగాహన ఉండదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఎమ్మెల్యేల స్థూల నెలసరి వేతనం 163శాతం పెరిగింది. ప్రస్తుతం ఒక్కో ఎమ్మెల్యే నెలకు రూ.2.50లక్షలు జీతం తీసుకుంటున్నారు. ఇందులో వీరి అసలు వేతనం రూ.20వేలు అయితే నియోజకవర్గ అలవెన్సుల కింద ప్రభుత్వం రూ.2.30లక్షలు అందజేస్తుంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన సభ్యుడి రోజువారి భత్యం రూ.వేయి చెల్లిస్తారు. పదవీకాలం ముగిసిన తర్వాత పెన్షన్ సైతం అందుతుంది.

రూ.5 కోట్ల సీడీఎఫ్ నిధులు

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం 119 శాసన సభ్యులకు ప్రతీ సంవత్సరం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్) కింద రూ.5కోట్లు కేటాయిస్తుంది. ఇలా మంజూరు చేసిన నిధులను పల్లెలు, పట్టణాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

వేతన వివరాలు

పదవి	వేతనం
ముఖ్యమంత్రి	రూ.4.21లక్షలు
స్పీకర్	రూ.4.11లక్షలు
మంత్రులు, చీఫ్ విప్, విప్	రూ.4లక్షలు

అమాత్యులకు అభినందనలు



సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ తదితరులు

పరిగి: ప్రజా ప్రభుత్వంలోని మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న పలువురు మంత్రులకు శుక్రవారం డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తొలి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట చిట్యాల సర్పంచ్ రజిత, పుల్లారెడ్డి, చిన్న నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకులతో సమావేశం

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన అధికారులు, అఖిల పక్ష నాయకులతో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించారు. త్వరలో జరగనున్న పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ గురించి మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణపై అఖిలపక్ష నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ గురించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేశ్, డీటీలు సురేశ్, శివకుమార్, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దివ్యాంగులను ప్రోత్సహించాలి



పరుగు పందెంలో పాల్గొన్న దివ్యాంగ చిన్నారులు

జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి

వికారాబాద్ అర్బన్: సమాజంలో దివ్యాంగులను సాధారణ పౌరులతో సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలితకుమారి అన్నారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ క్రీడల్లో జిల్లా నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొన్నట్లు ఆమె వివరించారు. దివ్యాంగులు వివిధ రంగాల్లో రాణిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దివ్యాంగులను మరింత ప్రోత్సహించాలన్నారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు, డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ నర్సింలు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు

చేవెళ్ల: ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలానికి చెందిన గండు మంజుల(45) చేవెళ్లలోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. అనిల్‌కుమార్, బాల్‌రాజులు ఆటోలో మంజులను ఎక్కించుకొని షాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలోని మల్లారెడ్డిగూడ బస్‌స్టేజీకి సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంజుల మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాల్‌రాజ్‌కు కాలి విరిగి తీవ్రంగా గాయపడగా అనిల్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మద్యం మత్తులో ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చేవెళ్ల ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

భార్య మృతిపై సందేహం

తన భార్య మృతిపై తనకు అనుమానం ఉందని భర్త గిరిజాపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి తన భార్యను ఆటోలో ఎక్కించుకొని డబ్బులు, నగల కోసం బాగా మద్యం తాగించి హత్యచేసి ఉంటారని అనుమానం ఉందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు అనుమానస్పద మృతిగా కూడా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోవాలాలను ఆదుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు, ఓనర్లు

ప్రతినిధుల జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రావు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు, ఓనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆటో ప్రతినిధుల జేఏసీ చైర్మన్ మడుపు వేణుగోపాల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల, ఓనర్ల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో నియోజకవర్గంలోని 2500 మంది ఆటో డ్రైవర్లు, ఓనర్లు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. కొనుగోలు చేసిన బండ్లకు ఈఎంఐలు చెల్లించలేక, డీజిల్ ధరలు భరించలేక వారి కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ఆలోచించి ప్రతి నెల రూ.12 వేలు అందించాలని, ఉచితంగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. తహసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ డీఎం ఉష తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంకు ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు వివరించారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల సంఖ్యను పెంచాలని, మండల పరిధిలోని రంగంపల్లి, మొగిలిగిద్ద బస్టాప్ వద్ద పరిగి వెళ్లే అన్ని బస్సులను నిలపాలని కోరారు. అలాగే ఉదయం వేళల్లో అమస్‌గల్లు రూట్‌లో బస్సుల సంఖ్యను పెంచాలని, షాద్‌నగర్ నుంచి శంకర్‌పల్లికి బస్సును పునరుద్ధరించాలని విన్నవించారు. ప్రయాణికుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ డీఎం సమాధానామిచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీని అభివృద్ధి చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సంస్థను ప్రగతిపథంలో నడిపించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది తోడ్పాటు అందించాలని సూచించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇంటిని నిర్మిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ తారాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 141లోని ప్రభుత్వభూమిలో గ్రామానికి చెందిన పి.రాములు అక్రమంగా ఇంటిని నిర్మిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీనివాస్‌గౌడ్, శ్యామప్ప, నర్సింలు తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పూడూరు: చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని న్యాయవాది నర్సింహారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తిలో పరిగి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ చట్టాలపై అవగాహన లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యాభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, న్యాయవాదులు గౌస్‌పాషా, వేణుగోపాల్, నసీర్, వెంకటయ్య, సాయన్న, వివేకానందరావు, సత్యనారాయణ, అశోక్‌కుమార్, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మణికంఠుడి శోభాయాత్ర



యాత్రలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

పరిగి: భక్తిభావంతోనే ముక్తి లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో మణికంఠుడి శోభాయాత్రను మాలధారణ స్వాములు వైభవంగా నిర్వహించారు. ఈ యాత్రకు హాజరైన చైర్మన్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ శోభాయాత్రలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ తీగల చోరీ

మంచాల: వ్యవసాయ పొలం వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరు చోరీకి గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక సర్పంచ్ శివరాల పాండు వివరాల ప్రకారం.. తిప్పాయిగూడలోని ముకునూర్ రోడ్డు సమీపంలో చిల్లాపురం రాములు వ్యవసాయ బావి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గురువారం రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ తీగను ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన రైతులు విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ తీగలను అపహరిస్తున్నారని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'జీరో టికెట్' తీసుకోవాల్సిందే

లేదంటే రూ.500 జరిమానా



ఫ్రీ టికెట్ తీసుకుంటున్న మహిళ

బొంరాస్‌పేట: కొత్త సర్కారు మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించింది. వారం రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. శుక్రవారం నుంచి అన్ని ఆర్టీసీ డిపో అధికారుల ఆదేశాల మేరకు 'జీరో టికెట్'కు ఆధార్ తప్పనిసరిగా మహిళలు చూపించాలని నిబంధనలు అమలు చేస్తోంది. మహిళలకు అమలవుతున్న 'ఫ్రీ టికెట్'ను ప్రతీ తెలంగాణ మహిళ తీసుకోవాల్సిందేనని కండక్టర్లు సూచించారు. ఆధార్ కార్డు చూపించి ఫ్రీ టికెట్ పొందాలని మహిళా ప్రయాణికుల్ని కోరుతున్నారు. టికెట్ తీసుకోని ఎడల తనిఖీ అధికారులు రూ.500 జరిమానా విధిస్తారని హెచ్చరిస్తున్నారు. ఈ విధానం శుక్రవారం నుంచి అమలులోకి వచ్చిందంటున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఎంఈఓ హబీబ్ అహ్మద్



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

కుల్కచర్ల: ఉపాధ్యాయులు విద్యార్థులకు త్వరితగతిన అర్థమగు విధానాలను అనుసరించాలని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదివిన అంశాలు ఎక్కువ రోజులు గుర్తుండేలా.. వారికి త్వరగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠ్యబోధన చేయాలని సూచించారు. చదవడం, రాయడం, గుణించడం వంటి ప్రాథమిక అంశాలలో పరిజ్ఞానం పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతో కారుణ్య నియామకం

గంటల వ్యవధిలోనే బాధిత మహిళకు ఉద్యోగం



సత్యలతకు హామీ ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కందుకూరు: రెండేళ్ల క్రితం విధుల్లో ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ భార్యకు సీఎం చొరవతో గంటల వ్యవధిలోనే కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సొంగ శేఖర్ అంబర్‌పేట పోలీస్ హెడ్‌క్వార్టర్ పరిధిలో విధులు నిర్వర్తించేవారు. ఆయన 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సత్యలతను వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప ఉంది. 2021 సెప్టెంబర్ 30న ఆయన విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి ఆయన భార్య ఉద్యోగం కోసం పోలీసుల అధికారుల చుట్టూ తిరిగినా నాన్ లోకల్ కారణం చూపుతూ ఫైల్ పక్కకు పెట్టారు. దీంతో మృతుడి స్నేహితుడైన మరో కానిస్టేబుల్ శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం ఉదయం సత్యలత పాపతో పాటు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన గోడును వినిపించారు. వెంటనే స్పందించిన సీఎం ఆమెకు ఉద్యోగం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. గంటల వ్యవధిలోనే సత్యలతకు రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పిస్తూ ఆర్డర్ జారీ అయింది. దీంతో ఆమెతో పాటు కుటుంబీకులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

చేవెళ్ల అభివృద్ధికి సహకరించండి

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర మంత్రి సీతక్కను చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం నగరంలోని ఆమె నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యాక్షుడు పాండు, మాజీ సర్పంచ్ నర్సింలు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, మహేశ్‌కుమార్‌గౌడ్‌లను సైతం కలిసి అభినందనలు ప్రకటించారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా అన్ని నియోజకవర్గాల ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు చేసిన దాడుల్లో ఆరుమంది జూదరులను అరెస్టు చేయడంతో పాటు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల ఎస్ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ జెన్నాయిగూడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఆదిబట్ల పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో రావిర్యాలకి చెందిన జంగయ్య, లింగం, సంజీవ, బాలేశ్, పాశం లింగం, నరేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద రూ.83,600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.